క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి వినతి



గేటు మీటింగ్‌లో సీఐటీయూ యూనియన్ నాయకులు

గోపాలపట్నం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నేవల్ సిస్టమ్స్ టెక్నాలజీ లేబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్)సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మెయిన్ గేటు వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. పలు డిమాండ్లను యాజమాన్యం ముందు ఉంచారు. కొత్త పింఛన్‌ను రద్దు చేసి పాతపింఛన్ అమలు చేయాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వంద శాతం కారుణ్య నియామకాలు జరపాలని, ఉద్యోగులకు అనుకూలంగా ఇచ్చిన కోర్టు తీర్పులను అమలు చేయాలని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని యాజమాన్యానికి అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి గౌరవ్ కె. ప్రజాపతి, అధ్యక్షుడు అకిరి సునీల్, ఉపాధ్యక్షుడు హరిరామ్‌జత్, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

గోపాలపట్నం: కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ బుధవారం ఎన్ఏడీ మెయిన్ గేటు ఎదుట ఐఎన్‌టీయూసీ నాయకులు ధర్నా చేపట్టారు. ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశ వ్యాప్త సమ్మెకు మద్దతుగా ఎన్ఏడీ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయరాదని, లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవిద్య ఉపాసన కోర్సు



శ్రీవిద్య ఉపాసనలో పాల్గొన్న దేశ విదేశాలకు చెందిన అభ్యాసకులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధనా పీఠంలో 7 రోజులుగా నిర్వహిస్తున్న శ్రీవిద్య ఉపాసన అడ్వాన్స్‌డ్ కోర్సు బుధవారంతో ముగిసింది. దేశంలోని ముంబై, పూణే, హైదరాబాద్, ఢిల్లీ వంటి ప్రాంతాలతో పాటు యూఎస్ఏ, ఆస్ట్రేలియా, దుబాయ్, ఇటలీ, డెన్మార్క్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 24 మంది అభ్యాసకులు ఈ కోర్సులో శిక్షణ పొందారు. కోర్సులో భాగంగా దశ మహా విద్యలు, నవావరణ అర్చనలు, హోమ విధానాలు నేర్చుకున్నారని గురుమాత అన్నపూర్ణమ్మ వెల్లడించారు. గురుమాతతో పాటు ఆచార్యులు మూర్తి రాధ, కందర్ప రమలకు అభ్యాసకులు కృతజ్ఞతలు తెలిపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి పట్టాభిరామ్



బి.వి.పట్టాభిరామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సీతంపేట: బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం వ్యక్తిత్వ వికాస నిపుణుడు, హిప్నాటిస్ట్, కౌన్సిలర్, ఇంద్రజాలికుడు డాక్టర్ బి.వి.పట్టాభిరామ్ సంస్మరణ సభ జరిగింది. ఆయన చిత్రపటానికి సంఘ సేవకుడు భరణికాన రామారావు, సీనియర్ మెజీషియన్ కె.విజయ్‌కుమార్, బాలవికాస్ ఫౌండేషన్ కన్వీనర్ నరవ ప్రకాశరావు, గాంధీ సెంటర్ సంయుక్త కార్యదర్శి కె.వి.ఎస్.మూర్తి, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు కాశీవిశ్వేశ్వరావు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పట్టాభిరామ్‌తో తమకున్న అనుబంధం, అనుభవాలను మిగిలిన వారితో పంచుకున్నారు. భరణికాన రామారావు మాట్లాడుతూ పట్టాభిరామ్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, తనదైన రంగంలో అంతర్జాతీయ గుర్తింపు పొందారన్నారు.

అటు వృథా.. ఇటు వ్యధ

- వ్యర్థాల తొలగింపునకు రూ.కోటితో ప్రత్యేక యంత్రం
- నిరుపయోగంగా 'గార్బేజ్ కన్వేయర్'
- కాంట్రాక్టర్ టెండర్ ముగిసి ఏడాది
- నిలిచిపోతున్న ఏడు గ్రామాల నుంచి వచ్చే వ్యర్థాలు
- దుర్గంధం, వ్యాధులతో స్థానికుల అవస్థలు



రూ కోటి రూపాయలతో కొనుగోలు చేసిన వ్యర్థాలు తొలగించే మెషీన్

మల్కాపురం: అధికారుల నిర్లక్ష్యంతో కోటి రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన 'వ్యర్థాలు తొలగించే యంత్రం' నిరుపయోగంగా మారింది. ఏడాదిగా దీనిని వినియోగించకపోవడంతో ఇప్పుడు ఎంతవరకు పని చేస్తుందో కూడా అర్థం కాని పరిస్థితి. దీంతో ఒకవైపు ప్రజాధనం వృథా కాగా.. మ రోవైపు గుట్టలుగా పేరుకుపోతున్న వ్యర్థాలతో పరి సర ప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతున్న పరిస్థితి.

ఏడు గ్రామాల వ్యర్థాలు ఇక్కడే..

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ కల్యాణమండపం ఎదురుగా పెద్ద గెడ్డ ఉంది. ఈ గెడ్డకు ఎగువ ప్రాంతాలైన జనతాకాలనీ, ప్రకాష్‌నగర్, అచ్చినాయుడుతోట, ప్రియదర్శిని కాలనీ, గాంధీజీ వీధి తదితర ప్రాంతాల్లోని కాల్వలు, గెడ్డల ద్వారా వచ్చే మురుగు, వ్యర్థాలు ఇక్కడికి చేరతాయి. దీనిని ఆనుకుని ఉన్న హెచ్‌పీసీఎల్ రక్షణ గోడ దిగువ నుంచి గల మార్గం ద్వారా సముద్రంలో వ్యర్థపు నీరు కలిస్తే, వ్యర్థాలను వ్యాన్ల ద్వారా కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డ్‌కు ఎప్పటికప్పుడు తరలించేవారు. అయితే, వర్షాలు అధికంగా కురిసినప్పుడు, లేదా వ్యర్థాలను తరలించే వ్యాన్లు రాకున్నా.. మరే ఇతర సమస్య తలెత్తినా ఇక్కడ గెడ్డలో భారీగా వ్యర్థాలు చేరిపోవడంతో దుర్గంధం, క్రిములతో స్థానికులు అనారోగ్యం పాలయ్యేవారు. అలాగే భారీగా వర్షాలు వచ్చినప్పుడు ఈ గెడ్డ పొంగి, గెడ్డను ఆనుకుని ఉన్న నివాసాల్లోకి మురుగు నీరు వ్యర్థాలతో పాటు చేరేది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని అధికారులు కొంతకాలం క్రితం కోటి రూపాయల వ్యయంతో గార్బేజ్ కన్వేయర్ (ఎస్కలేటర్ మెషీన్)ను ఏర్పాటు చేశారు. రూ.10వేల జీతంతో ఒక ఆపరేటర్‌ను , రూ.4వేల జీతంతో ఒక వాచ్‌మన్‌ను నియమించి, రోజూ రెండుపూటలా గెడ్డలో వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించే పనులను అధికారులు ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయితే, సదరు కాంట్రాక్టర్ గడువు ముగిసి ఏడాది అయింది. దీంతో ఆ కాంట్రాక్టర్ వ్యర్థాల తొలగింపు పనులను మానేశారు. ఇక అక్కడితో కథ మళ్లీ మొదటికే వచ్చింది.

కథ మళ్లీ మొదటికి..

కాంట్రాక్టర్ పనులను నిలిపివేయడంతో గెడ్డలో వ్యర్థాలు నిలిచిపోతున్నాయి. దీంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వార్డులో పూర్తి స్థాయి సిబ్బంది వచ్చినప్పుడు పూడికలను తొలగించే కార్యక్రమం చేపడుతున్నారు. సరిపడిన సంఖ్యలో సిబ్బంది రాకుంటా వ్యర్థాలు అదే స్థాయిలో ఉండిపోతున్నాయి. గెడ్డలో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించేందుకు అమర్చిన మెషీన్ ఉండగా, ఇవేం కష్టాలని పలువురు వాపోతున్నారు. ఏడాదిగా ఆ మెషీన్ పని వినియోగించకపోవడం, అక్కడ వాచ్‌మన్ లేకపోవడంతో మెషీన్‌లో విడిపరికరాలు ఎలా ఉన్నాయోనని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, మెషీన్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



మెషీన్ చుట్టు నిలిచిన వ్యర్థాలు

ఇంత నిర్లక్ష్యమైతే ఎలా?



కోటి రూపాయలతో కొనుగోలు చేసిన యంత్రం ఏడాదిగా నిరుపయోగంగా పడి ఉంది. దీనిని సంరక్షించాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారు. వినియోగంలో లేని మెషీన్‌కు ఏమైనా అయితే, మరలా ప్రజాధనమే ఉపయోగిస్తారు. ఇలా ప్రజాధనం దుర్వినియోగం చేసే కంటే ఆ మెషీన్‌ను అధికారులు వినియోగించే విధంగా చూడాలి. గెడ్డలో వ్యర్థాలు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి.

– శీర చిన్నాజీయాదవ్, మల్కాపురం

అధికారులు స్పందించాలి



ఎంతో విలువైన మెషీన్ నిరుపయోగంగా మారింది. వాచ్‌మన్ లేకపోవడం వల్ల మెషీన్ పరికరాలు ఎలా ఉన్నాయో కూడా తెలియదు. అధికారులు స్పందించాలి. మెషీన్‌ను వినియోగంలోకి తెచ్చి, వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించేలా చూడాలి.

– బాలు, మల్కాపురం

సమ్మె విజయవంతం



హెచ్‌పీసీఎల్ సీ గేటు వద్ద నిరసన తెలుపుతున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు



ఐవోసీ మార్గంలో...

మల్కాపురం: కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలనే డిమాండ్‌తో కార్మిక సంఘాలు చేపట్టిన దేశ వ్యాప్త సమ్మె ప్రశాంతంగా ముగిసింది. పలు పరిశ్రమల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు,రెగ్యూలర్ కార్మికులు బుధవారం స్వచ్ఛందంగా తమ తమ విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సీ గేటు వద్ద,లేబర్ గేటు,ఐవోసీ గేటు వద్ద వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం,వైఎస్సార్ టీయూ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్,సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి,ఏఐటీయూసీ జిల్లా నాయకుడు సత్యాంజనేయ తదితరులు పాల్గొని నినాదాలు చేశారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్ వల్ల లక్షలాది మంది కార్మికులకు నష్టం జరుగుతున్నా పాలకులకు చీమ కుట్టినట్లైనా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్రంలో కూటమి సర్కార్‌లో ఉన్న చంద్రబాబునాయుడు,పవన్‌కల్యాణ్ సమర్థించడం దారుణమన్నారు. పలు పరిశ్రమల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు 8 గంటల పని దినాలు కాకుండా 12 గంటలు చేయిస్తూ వారి శ్రమను కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారని ఆరోపించారు.కార్యక్రమంలో నాయకులు పి.పైడిరాజు,ఎం.సత్యనారాయణ,పి.వి.రమణ,రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో ప్రత్యేక పూజలు

మల్కాపురం: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని 60వ వార్డు మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం ఆరు గంటల నుంచే బాబాకు పంచామృతాలు,విభూదితో అభిషేకాలు చేపట్టారు.అనంతరం షిర్డీ నుంచి తీసుకు వచ్చిన బాబా పాదుకలకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం బాబా పాదుకలను పుర వీధుల్లో అంగ రంగ వైభవంగా ఊరేగించారు.ఈ సందర్భంగా కోలాట నృత్యగురువు ఆకుల లోవరాజేశ్వరి ఆధ్వర్యంలో చిన్నారులు బాబా కీర్తనలకు నృత్యాలు చేశారు.గురువారం గురుపౌర్ణమి పురస్కరించుకుని మందిరంలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. భక్తులు బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.



బాబా పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

రైల్వే కార్మికుల సమస్యలపై ధర్నా

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో డొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయం వద్ద రైల్వే కార్మికుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రామిక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జె సంపత్‌కుమార్ మాట్లాడుతూ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేస్(ఎన్ఎఫ్ఐఆర్) జనరల్ సెక్రటరీ ఎం.రాఘవయ్య పిలుపు మేరకు ధర్నా చేసినట్లు తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా, అనంతరం డీఆర్ఎం కార్యాలయంలో మెమోరండం సమర్పించినట్లు చెప్పారు. శ్రామిక్ కాంగ్రెస్, వాల్తేర్ డివిజన్ కో ఆర్డినేటర్ టి.వి.మౌళి మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైల్వేలో పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, రైల్వేల్లో ప్రైవేటీకరణ, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు విధానాలనూ ఆపాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, వెంటనే ఆర్ఆర్‌బీ, ఆర్ఆర్‌సీ ద్వారా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నటు తెలిపారు. ఈ మేరకు రైల్వే బోర్డు చైర్మన్‌కు వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం ద్వారా మెమోరాండం సమర్పిస్తున్నటు చెప్పారు. ధర్నా అనంతరం యూనియన్ నాయకులు సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్‌కు మెమోరండం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఆయా బ్రాంచ్‌ల సెక్రటరీలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ నాయకులు

దారులన్నీ గిరివైపే..

- గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు
- భక్తుల సేవలో తరించిన స్థానికులు





భజన చేస్తూ భక్తి పారవశ్యంతో ప్రదక్షిణ చేస్తున్న భక్తురాలు



సింహాచలం రైల్వే స్టేషన్‌లో భక్తుల రద్దీ

గోపాలపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం వరాహ లక్ష్మీనృసింహ స్వామి గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. ఉదయం 10 గంటల నుంచే భక్తులు సింహాచలానికి బయలు దేరారు. దారులన్నీ గిరివైపే కదిలాయి. తొలి పావంచా వద్ద కొబ్బరి కాయ కొట్టి గిరి ప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. దీంతో గోపాలపట్నం పరిసర ప్రాంతాల నుంచి సింహాచలానికి బయలు దేరారు. మధ్యాహ్నం నుంచి భక్తుల రద్దీ పెరిగింది. సింహాచలం రైల్వే స్టేషన్ జనంతో కిటకిటలాడింది. సాయంత్రానికి గోపాలపట్నం, ప్రహల్లాదపురం ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి.



ప్రసాదం అందిస్తున్న, కీర్తి త్రినాథ్

భక్తుల సేవలో...

భక్తుల సేవలో స్థానికులు తరించారు. చాలా మంది అల్పాహారం, టీ, బోండా వంటి వాటితో పాటు టాటా గ్లూకోజ్, బిస్కెట్లు, బాదం మిల్క్, పులిహోరా వంటివి అందించారు. కొన్ని చోట్ల స్వచ్ఛంద సంస్థలు చేయగా.. మరి కొన్ని చోట్ల స్నేహితులే ఒకటై భక్తుల సేవలో తరించారు.

విశాఖ విద్య: గిరిప్రదక్షిణ భక్తులకు శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం పులిహోర, బిస్కెట్ ప్యాకెట్లు, టీ పంపిణీ చేశారు. నడకదారిలో వెళ్లే భక్తులకు కాళ్లకు నొప్పి తగ్గడానికి స్ప్రే , నొప్పి నివారణ మాత్రలు, ఫస్ట్ ఎయిడ్ బ్యాండెయిడ్స్ వంటివి పంపిణీ చేశారు. గిరిప్రదక్షిణ భక్తులకు ప్రతీ ఏటా మాదిరే సంస్థ ద్వారా సేవలు అందిస్తున్నామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కీర్తి త్రినాథ్ అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత రైల్వే సీఐ గంగ్రేటి తిరుపతిరావు, దుర్గాప్రసాద్, నారాయణ మూర్తి, వై. రవి, పట్నాయక్, విశ్రాంత డిఫెన్స్ అధికారి టీవీ చారి పాల్గొన్నారు



గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్డులో నిలిచిన వాహనాలు



వంటిల్లు జంక్షన్‌లో భక్తుల కాళ్లకు మర్దన చేస్తున్న జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు

మావోయిస్టులకు ఐజీ హెచ్చరికపై భగ్గుమన్న పౌర సంఘాలు

అల్లిపురం: బస్తర్ ఐజీ సుందర్ రాజ్ మావోయిస్టులను ఉద్దేశించి చేసిన 'లొంగిపోండి లేదంటే చంపేస్తాం' అనే ప్రకటనను పౌర ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. బుధవారం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పౌర సంఘాల నాయకులు ఈ వ్యాఖ్యలు చేశారు. పౌర సంఘాలు నేతలు మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపడుతున్న హత్యాకాండను ఆపాలని, ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశాయి. ఆదివాసీ నిరసన శిబిరాల్లో ఉన్నవారిని సైతం మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే పేరుతో కాల్చి చంపుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో కనీసం బస్సులు కూడా లేని చోట ఆరు లైన్ల రోడ్ల నిర్మాణం చేపట్టి, 350కి పైగా భద్రతా క్యాంపులను పెట్టి ఆదివాసుల భూములను లాక్కుంటున్నారని, విద్య, వైద్యం, సంతల నిర్వహణ లేకపోవడం వంటి అనేక విధాలుగా వారిని నిర్బంధిస్తున్నారని పౌర సంఘాలు ఆరోపించాయి. ఆదివాసీలు పోరాడి సాధించుకున్న ఫిఫ్త్ షెడ్యూల్, అటవీ సంరక్షణ చట్టం 2006, పంచాయతీ రాజ్ ఎక్స్‌టెన్షన్ యాక్ట్ (పీసా యాక్ట్) వంటి అన్ని చట్టాలను ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని ఆరోపించారు. అడవుల నుండి ఆదివాసీలను బయటకు గెంటే కుట్రను ప్రభుత్వం చేపడుతోందని, ఈ కుట్రలను 'ఆపరేషన్ కగార్' పేరుతో చేస్తున్న నరహంతక మారణ కాండను అభ్యుదయ వాదులు, ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఖండించాలని పౌర ప్రజా సంఘాల వేదిక డిమాండ్ చేసింది. కార్యక్రమంలో పౌర ప్రజా సంఘాల సమన్వయకర్త పాత్రపల్లి చంద్రశేఖర్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు లలిత, న్యాయవాది పద్మ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కసిరెడ్డి సత్యనారాయణ, ఐఎఫ్‌టీయూసీ జిల్లా నాయకులు ఎస్‌కే రహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కే అచ్యుత్ రావు, ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నెయ్యల నాగభూషణరావు, సీపీఐ ఎంఎల్ ప్రజా పోరు నాయకులు దేవా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ప్రజాసంఘాల పౌరవేదిక ప్రతినిధులు

విమ్స్ కిటకిట

ఆరిలోవ: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) రోగులతో కిటకిటలాడుతోంది. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు భారినపడుతున్న వారు విమ్స్‌ను ఆశ్రయిస్తున్నారు. వీరిలో కొద్ది రోజులుగా జ్వరాలు భారిన పడుతున్నవారు ఎక్కువగా ఉన్నారు. వారం రోజులుగా ఓపీ సుమారు 800 దాటుతుంది. జ్వరాలతో పాటు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ బాధితులు నమోదవుతున్నారు. ఇక్కడ సాధారణ జ్వరాలతో పాటు డెంగ్యూ, మలేరియాతో బాధపడుతున్నవారు ఇటీవల ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతున్నారు. ఇక్కడ ఆర్థోపెడిక్, జనరల్, కార్డియాలజీ, ఈఎన్‌టీ తదితర వాటితోపాటు జ్వరాలతో వచ్చే రోగులతో రోజూ ఓపీ నమోదువుతుంది. జ్వరాలతో వెళ్లేవారికి రక్త పరీక్షలు నిర్వహించడంతో వారిలో మలేరియా, డెంగ్యూ జ్వరాలు సోకినట్లు వెల్లడవుతోంది. అలాంటివారు విమ్స్‌లో ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. రోజూ విమ్స్‌కు వస్తున్న వారిలో రక్త పరీక్షల అనంతరం 15 శాతంపైగా జ్వరాల బారిన పడినవారే ఉంటున్నారు.


నేడు సత్యదేవునికి పౌర్ణమి పూజలు

దాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి దేవాలయంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి టి. రాజగోపాల్ రెడ్డి తెలిపారు. భక్తులు సామూహిక వ్రతంలో పాల్గొని, సత్యదేవుని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. పౌర్ణమి విశిష్టత దృష్ట్యా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పి. నరసింహాచార్యులు నేతృత్వంలో వేద పండితులు వేకువజాము నుంచే భక్తుల ప్రదక్షిణ, వ్రతాచరణకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని ఈవో వివరించారు.

ద్విమూర్తుల దర్శనం: ఓ గొప్ప విశేషం

పూర్వం ఉత్తరాది ప్రాంతానికి చెందిన బాబాజీ అనే రుషి లోక కల్యాణం కోసం, ప్రజల కష్టాలు తీరి సిరి సంపదలు, సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలనే ఆశయంతో ఈ ప్రాంతానికి వచ్చారు. నగరంలోని కేజీహెచ్‌కు సమీపంలో ఉన్న బాబాజీ కొండపై సత్యనారాయణ స్వామి పాదాలను ప్రతిష్ఠించి, ఆరు పౌర్ణమిల పాటు ప్రదక్షిణ చేసి వ్రతం ఆచరించడం ద్వారా భక్తులు కోరిన కోరికలు తీరుతాయని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉత్తరాది సంప్రదాయం ప్రకారం పాలరాతి ధ్రువమూర్తిని సైతం ప్రతిష్ఠించారు. కాలక్రమేణా ఈ క్షేత్రం ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. శిథిలమైన పూర్వపు ఆలయాన్ని తొలగించి, కనకమహాలక్ష్మి ఆలయ నిధులతో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు సత్యనారాయణ స్వామి దేవస్థానాన్ని పునర్నిర్మించారు. పునరుద్ధరణలో భాగంగా దక్షిణాది సంప్రదాయాన్ని అనుసరించి నల్లరాతి ధ్రువమూర్తులను ఏర్పాటు చేయడంతో, ఇక్కడ ద్విమూర్తుల దర్శనం ఒక గొప్ప విశేషంగా మారింది.





స్వామి పాదాల దిగువన వంటశాల ప్రాశస్త్యం

ఈ ఆలయంలో మరో విశేషం ఏమిటంటే, స్వామి పాదాలకు దిగువన, అంటే కొండ కింద భాగంలో ఏర్పాటు చేసిన వంటశాలలో ప్రసాదాల తయారీ చాలా ప్రాశస్త్యమైనదిగా భక్తులు భావిస్తారు.